# మమతలో మరొక కోణం

బ్రాకాన్వెంట్ బస్సు రామారావుపేట జంక్షన్ను దాటి కొద్ది గజాలదూరం వెళ్ళి రోడ్డు పక్కగా ఆగింది.

కుడివైపున ఉన్న అందమైన చిన్న డాబా ఇంటి గేటు ముందర అంతవరకూ నిలుచుని ఎదురుచూస్తున్న ఏడేళ్ళపాప విజయ బస్సు ఆగిన తక్షణం పరిగెత్తింది.

రోడ్డుకి ఎడమపక్కగా పెద్ద భవనం. వెడల్పయిన ఇనపగేటు.

అది నీలా నర్సింగ్‌హోమ్.

బస్ ఆగడం గమనించి, ఆ గేటులోనించి బస్సు దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చి కూడా ఆ పాప, నిర్మల ఒక్కసారి ఆగిపోయింది.

కండక్టర్ విజయనెత్తుకుని, రెండుబుగ్గల మీదా మృదువుగా ముద్దాడి థాంక్స్ చెబుతున్నాడు.

నిర్మల తనకేమీ పట్టనట్లే బస్‌లోకి గెంతి కుడి చేతివైపు మూల సీటులో కూర్చుండిపోయింది.

కొద్ది నిమిషాలు గడిచాక కండక్టర్ విజయను చాలా జాగ్రత్తగా ఎత్తుకుని బస్‌లో దింపాడు.

నిర్మల పక్కన కూర్చుంటూ స్కూల్ బ్యాగ్ పక్కన ఉంచి — "గుడ్‌మార్నింగ్" అంది ఆమె నుద్దేశించి విజయ.

నిర్మల ఆమె మాట వినిపించుకోలేదు.

కండక్టర్ రైట్ చెప్పేడు. బస్ పరిగెత్తసాగింది.

"కోపం వచ్చిందా నిర్మలా?" మెల్లిగా బతిమాలుతున్నట్లు అడిగింది విజయ.

ఈసారి మౌనంగానే ఉండిపోయిందామె.



"ప్లీజ్, నాతో మాట్లాడవూ?"

"ఊహుఁ . . . నీకూ నాకూ మాటలుగేవు. నువ్వు నా ఫ్రెండ్‌వి కావు." కనీసం విజయవంక చూడనైనా చూడకుండా అంది నిర్మల కీచుగొంతుకతో.

దిగులుగా చూసింది విజయ. ఆక్షణాల్లో చాలా విలువైనదేదో పోగొట్టుకుంటున్నట్లు ఆ లేత వదనంలో విచారం ఆవరించింది.

"ఎందుకని?" ఎలాగో అడిగింది విజయ గ్లాస్‌లోంచి మసకగా కనిపిస్తున్న నిర్మల ప్రతిబింబంలోకి చూస్తూ.

"నేను చెప్పిన మాట నువ్వు వినలేదు."

ప్రశ్నార్థకంగా చూసింది విజయ. అమాయికత్వం చెరగని ఆ కన్నులలో చాలా ఆత్రుత తొంగి చూస్తోంది.

"కండక్టర్‌తో మాట్లాడనని నిన్న ప్రామిస్ చేశావా?" నిన్నటి తన ఆజ్ఞను గుర్తుచేస్తున్నట్లు కఠినంగా అంది నిర్మల ఈ సారి విజయకన్నుల్లోకి చూస్తూ.

విజయ కన్నుల్లో నీళ్లు తిరిగాయి.

నిజమే. నిన్న ప్లేగ్రౌండ్‌లో అడిగినప్పుడు తను అలాగే అంది.

"ఇవాళ ప్రామిస్ బ్రేక్ చేశావు!" గద్దించింది నిర్మల.

విజయ మనసు విలవిల కొట్టుకుంది.

కండక్టర్ తనని బస్ దగ్గిర ఎత్తుకుంటాడు. తన బుగ్గలమీద ముద్దుపెట్టుకుంటాడు. అప్పుడప్పుడు బస్‌లో తనకి కథలు చెబుతాడు. బర్త్ డే నాడు తనకి గ్రీటింగ్స్ ఇచ్చాడు. ఇంకా చాక్‌లెట్లూ, బొమ్మలూ . . .

మరి, కండక్టర్‌తో మాట్లాడడం మానెయ్యడం ఏం మంచిపని?

టీచర్‌కి తెలిస్తే తనకు మానర్స్ లేవని దెబ్బలాడరూ?

కండక్టర్ తనకు ఫ్రెండ్. నిర్మల కూడా తనకు ఫ్రెండే.

అసలు నిర్మలకెందుకు కండక్టరుమీద అంత కోపం?

"పోనీ . . . సాయంత్రంనించీ మానేస్తానా?" మరోక అవకాశం ఇస్తున్నట్లు అడిగింది నిర్మల.

ఏం చెప్పడానికీ మనస్కరించక, చాలా అవదలో చిక్కుకున్నట్లు జాలిగా దీలగా చూసింది విజయ తన స్నేహితురాలి వంక.

"ఊఁ . . . చెప్పు . . ." రెట్టించింది నిర్మల.

ఆమె ముఖంలోకి చూడటానికి భయంవేసినట్లు తలదించేసుకుంది విజయ. ఆ లేత మనసులో లక్ష ప్రశ్నలూ, కోటిభయాలూ ఎదురవసాగాయి. 'నిర్మల తనకు కావాలి. రోజూ సాయంత్రం వేళ తనూ ఆమే వాళ్ల కాంపౌండ్‌లో సీ—సా ఆటే ఆడుకుంటారు. బళ్లో కూడా తనూ ఆమే పక్కపక్కనే కూర్చుంటారు. నిర్మలతో మాట్లాడటం మానేస్తే మమ్మీ దెబ్బలాడుతుంది కూడా.

మరి కండక్టర్? అతనూ కావాలి తనకు. అతను చాలా మంచివాడు. చాలాసార్లు కథలు చెప్పేడు.

అయినా నిర్మల కతనిమీద ఎందుకంత కోపం? తనూ అతనూ బస్‌లోనే ఫ్రెండ్స్. స్కూలులోనూ

రూపురేఖలలో వ్యత్యాసమున్నా, తమకు లభించే వాత్సల్యంలో వ్యత్యాసాలు పిల్లలు సహించలేరు. పెద్దవాళ్ల అనురాగాన్ని కోరుకొనడంలో పిల్లలంతా సమానులే. అందుకే అవ్యక్తమైన బాలల మనస్తత్వం గ్రహించి మసలుకోకపోతే, పరిణామాలు ప్రమాదాలకు దారితీస్తాయి.

---

ఇంటిదగ్గిరా తను నిర్మల ఫ్రెండే.

ఎటూ నిర్ణయించుకోలేకపోయింది విజయ. చివర కెలాగో అపరాధిలా ముఖంపెట్టి రుద్ధకంఠంతో బతిమాలుకుంటున్నట్లు "రేపు చెబుతాను" అనగలిగింది.

"నువ్వు చాలా చెడ్డదానివి . . . ఇక నీ పక్కప్లేసు నాకు వద్దు. క్లాసులోకూడా." నిర్మల వెనక్కివెళ్లి మరోక మూల సీటులో కూర్చుని అద్దాలలోంచి రోడ్డు చూస్తూ కూర్చుండిపోయింది.

విజయ ఎలాగో ఏడుపు ఆపుకుంటూ ముందు సీటులోనే ఉండిపోయింది, తరవాత స్టాప్ వస్తే కండక్టర్‌నేదో అడగాలని ఆలోచిస్తూ.

"మేరీ అమ్మగారు రాలేదేం, సెలవా?" బస్ ఆపుతూ అడిగాడు డ్రైవర్.

పొరపాటు జరిగినట్లు నాలిక కరచుకుని — "ఒక్కసారి మళ్లీ ఆ స్టాప్‌కి పోనియ్. ఇవాళ ఆవిడ అక్కడికే వస్తామన్నారు. నేను మరిచిపోయాను."

ఇద్దరు పిల్లలు బస్ ఎక్కాక అలవాటుగా అరిచింది విజయ. "రైట్!" కండక్టర్ ఆమె వంక చూసి ఆప్యాయంగా నవ్వి మళ్లీ తనపనిలో మునిగిపోయాడు.

పద్ధతికి విరుద్ధంగా వెనక్కి వెళ్లవలసి వస్తున్నందుకు విసుక్కుంటూ మలుపు తిప్పాడు డ్రైవర్.

మళ్లీ . . . బస్ . . . రామారావుపేట జంక్షన్‌కి వచ్చి ఆగింది.

డ్రైవరూ, కండక్టరూ దిగి సిగరెట్లు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

విజయ తనుకూడా దిగి కండక్టర్ కేదో చెప్పాలనుకుని ఫుట్‌బోర్డు వరకూ వచ్చేటంతలో, మేరీ రావడమూ డ్రైవర్ తన సీటులోకి చేరుకోవడమూ జరిగాయి.

మేరీ బస్సెక్కిన మరుక్షణం నిర్మల గట్టిగా అరిచింది — "రైట్!"

ఆలోచనలో ఉన్న డ్రైవర్ అప్రయత్నంగానే బస్ స్టార్టుచేశాడు. కొద్ది గజాలు . . . కదిలేంతలో..

బస్‌లో గోల . . . "అమ్మా!" అన్న కేక . . . ఒక్క క్షణంలో వాతావరణం కల్లోలమయిపోయింది!

కంగారుపడుతూ సడన్ బ్రేక్ వేసి బస్ ఆపి దిగాడు డ్రైవర్.

మేరీతోపాటు కొందరు పిల్లలు కూడా దిగబోతూంటే మేరీ వారిని నివారించి క్రిందికి దిగింది.

---

**ఇచ్ఛాపురపు రామచంద్రం**

---

నొసటిమీద రక్తమూ, స్పృహతప్పి పడిపోయిన శరీరమూ, జరిగిన దేమిటో త్వరగానే ఊహించారు మేరీ, డ్రైవరూ.

"నీలా నర్సింగ్‌హోమ్‌లో చేర్పుదాం — " అంది మేరీ మెల్లిగా బాధగా.

ఆ శరీరాన్ని భుజంమీద వేసుకుని డ్రైవరూ, అతని వెనుక మేరీ వెళుతూంటే బస్‌లోని పిల్లలు భయంగా చూడసాగారు. హాస్పిటల్లో చేర్చి వాళ్లిద్దరూ వచ్చాక మళ్లీ బస్ కదిలింది.

ఈసారి పిల్లలందరూ ఏమాత్రమూ గోలచెయ్యకుండా కూర్చోడంతో బస్ చాలా బరువుగా కదులుతున్నట్లనిపించింది, డ్రైవర్‌కీ మేరీకీ. అలా నిశ్శబ్దంగా ప్రయాణం చేయడం ఆ బస్ చరిత్రలో లేనివిషయం.

* * *

సాయంత్రం అయిదు గంటలు దాటిన సమయం.

విజయకు ఇంగ్లీష్ ఫ్రాక్ వేసింది ఆమె మమ్మీ.

టాయ్‌లెట్‌లో చాలా ముద్దుగా ఉంది. దొండపండులాంటి పెదవులూ, గులాబీలలాంటి బుగ్గలూ ... బాబ్‌డ్ హెయిరూ — విజయను ఎవరైనా సరే ముచ్చటగా చూడకుండా ఉండలేనంత అందంగా తయారు చేసింది ఆమె మమ్మీ.

బూట్లు తొడిగించి గేటువరకూ తీసుకొచ్చి — "త్వరగా వచ్చెయ్యాలి విజ్జీ, చీకటిపడకుండా. ఏం?" అంది గేటుతీస్తూ.

"తప్పకుండా మమ్మీ—"

ఆత్రంగా రోడ్డు దాటుతూంది విజయ.

ఉదయం అద్దాలలోంచి కనపడిన దృశ్యం ఆమెలోని ఆదుర్దా చాలా అధికంచేస్తూంది.

డ్రైవర్ భుజంమీద వేసుకువెళ్లాడు కండక్టర్‌ని.

కండక్టర్ ముఖంమీద రక్తం . . . గ్లాసు తలుపులలోంచి తనకు సరిగ్గా కనపడలేదు.

ఆలోచిస్తున్న విజయ సరిగ్గా రోడ్డుమధ్యలో ఉంది.

అవతలనుంచి విపరీతమైన వేగంతో రాక్షసిలా వస్తూంది ఒక లారీ.

విజయ లారీని గమనించే స్థితిలో లేదు.

ఆమె మనస్సు కండక్టర్‌ని గురించి ఆలోచిస్తూ భయాందోళనలతో నిండి ఉంది. ఆమె అడుగులు కొంచెం తడబడుతున్నాయి కొత్త బూట్లు వేసుకోవడాన.

లారీ డ్రైవర్ విజయని చాలా సమీపంగా వచ్చే వరకూ గుర్తించలేదు . . . సరిగ్గా చివరి క్షణాలలో హారన్ . . . సడన్ బ్రేక్ . . . ఒక్క గెంతుగెంతి అవతలి పక్కకి చేరుకుంది విజయ. తను పెద్ద ప్రమాదంనించి తప్పించుకున్నదన్న విషయం కూడా ఆమెకి తెలియదు. నీలా నర్సింగ్‌హోమ్ కాంపౌండ్ వాల్ వద్దకు వచ్చి, ఆ గేటు ముందర ఆగిపోయింది.

అటూ ఇటూ ఆత్రంగా పరికించింది. ఎవరూ రావడం లేదు. ఇనపగేట్లు రెండింటినీ కలుపుతూ పైన గొలుసు తగిలించబడింది. త్వరత్వరగా కమ్మీలు పట్టుకుని ఎగబ్రాకి గొలుసు తొలగించింది. అక్కడినించి కిందికి జారడంలో . . . ఫ్రాక్‌మీద కొంచెం మట్టి అంటుకుంది. మోకాలిమీద సాక్స్‌కి పైగా

చిన్న గాయం అయింది తలుపు తెరుచుకోవడం తడవుగా ఇవేమీ లెఖ్ఖచెయ్యకుండా నర్సింగ్‌హోమ్‌లోకి పరుగుతీసింది.

రెండు మూడు వార్డులుచూసి, ఎక్కడా కండక్టర్ కనిపించకపోవడంతో డాక్టరు రూమువంక దారితీసింది. సరిగ్గా రూమువరకూ వచ్చేక ఆమె పాదాలాగిపోయాయ్. లోపల డాక్టర్ ఎవరితోనో మాట్లాడుతున్నారు. టీచర్ చెప్పిన మానర్స్ గుర్తుకివచ్చాయ్ — 'పెద్దవాళ్ళు మాట్లాడుకుంటూంటే వాళ్ళని డిస్టర్బ్ చేయకూడదు'

బాధగా ఎదురుచూడసాగింది విజయ.

ఒకవంక ఆత్రత . . .

వేరొకవంక సభ్యత .

భరించ శక్యంకాకపోయినా . . . అలాగే నిలబడిం దామె.

ఒక్కసారి మోకాలిమీది గాయం తుడుచుకుని, కర్చీఫ్‌తో ముఖంకూడా తుడుచుకుని రెండడుగులు ముందుకువేసి స్వింగ్ డోర్స్‌కి ఆనుకుని నిలబడింది.

మెల్లిగా లోపలనించి మాటలు వినబడుతున్నాయి.

"నువ్వతనికి మందులు ఇవ్వద్దు డాడీ!" నిర్మల గొంతు

"ఎందుకని?" డాక్టర్ గొంతు.

"అతను మంచివాడు కాదు."

"నిన్నేమైనా అన్నాడా?"

"కాదు డాడీ . . . రోజూ విజయనే ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటాడు. గ్రీటింగ్స్ నాకివ్వలేదు. చాక్లెట్లు కూడా విజయకే ఇస్తాడు."

నిర్మల మాటల్లో . . అసాధారణత్వం గమనించి డాక్టర్ ఆశ్చర్యపడ్డాడు. బాధపడాడు.

"నిన్నొక్కసారీ ముద్దుపెట్టుకోలేదా? చాక్లెట్స్ ఇవ్వలేదా?"

"ఊహుఁ" కోపంగా అంది నిర్మల కన్నీళ్ళు తుడుచుకుంటూ.

విజయ ఇంక ఏమాత్రమూ భరించలేకపోయింది. కండక్టర్‌కి దెబ్బతగిలింది . . . రక్తం వచ్చింది. మందివ్వకపోతే . . . ఏమైపోతాడో?

మెల్లిగా కూర్చుని స్వింగ్‌డోర్స్ దిగువ ఖాళీలోనించి లోపలికి తలపెట్టి — "డాక్టరు సాబ్ ... కండక్టర్‌కి మందివ్వరూ! అతను చాలా మంచివాడండీ—" అంది ఏడుపు నాపుకోలేక.

తుళ్ళిపడి చూసి — లేచి తలుపులు తెరిచి — విజయనెత్తుకుని కుర్చీలో కూర్చోపెట్టి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

నిర్మల ముఖం దించుకుని కూర్చోవడం గమనించి — "ఇటు చూడమ్మా నిర్మలా . . . మీ ఫ్రెండ్ . . విజయ వచ్చింది . . . నీతో ఆడుకుందుకు" అన్నాడు లాలనగా.

నిర్మల విజయవంక చూడలేదు.

"డాక్టర్ సాబ్, కండక్టర్‌కి మందివ్వరూ?" అతి దీనంగా అడిగింది విజయ.

"ఇచ్చానమ్మా . . . అతనికేమీ భయంలేదు" అని "నువ్వూ నిర్మలా ఏమైనా దెబ్బలాడుకున్నారా విజయా?" అంటూ మెల్లిగా అడిగాడు.

"లేదండీ . . . కాదండీ . . . నేనేమో . . ." చెప్పలేక వెక్కివెక్కి ఏడ్చేసింది విజయ. డాక్టర్ చాలా జాలితో విజయను తన ఒడిలోకి తీసుకుని బుజ్జగిస్తూ — "చెప్పమ్మా! . . ." అన్నాడు.

"మరేమో కండక్టర్ నా ఫ్రెండ్ నిర్మలా నా ఫ్రెండ్. కండక్టరేమో నన్ను రోజూ ముద్దుపెట్టుకుంటాడు. అతను చాలా మంచివాడు. కాదా డాక్టర్‌గారూ?"

"ఎందుకు కాదమ్మా? అతను చాలా మంచివాడు."

కళ్ళు తుడిచేసుకుని — "మరి . . . మంచి వాళ్ళతో ఫ్రెండ్‌షిప్ మానెయ్యడం చెడ్డపనికాదూ?" అంటూ డాక్టర్ ముఖంలోకి చూసింది విజయ.

"స్నేహం మానెయ్యడం చెడ్డపనే అమ్మా! . . . మంచివాళ్ళ స్నేహం మానెయ్యకూడదు."

"నిర్మల . . . నిర్మలేమో అతనితో ఫ్రెండ్‌షిప్ మానెయ్యమని నిన్న చెప్పింది. నేనూ మాట ఇచ్చాను. కాని . . . ఇవాళ . . . మరిచిపోయి కండక్టర్‌కి నా బుగ్గ అందించేను. అందుకని, బస్‌లో మాటలు మానేసింది నిర్మల స్కూల్లో ప్లేసు మార్చేసుకుంది. గ్రౌండ్‌లో నాతో ఆడలేదు డాక్టర్‌గారూ! . . ." మళ్ళీ దుఃఖం ముంచుకు వచ్చేసింది విజయకి.

డాక్టర్ విచిత్రంగా చూస్తూ . . . కొన్ని నిమిషాలపాటు ఆలోచనల్లో ఉండిపోయాడు.

"డాక్టర్‌గారూ . . . ఒక్కసారి కండక్టర్‌ని చూపించరూ?"

"ఇక్కడికే పిలిపిస్తాను" అంటూ నర్సుని పిలిచి కండక్టర్‌ని తీసుకురమ్మన్నాడు.

విజయ అతని ఒడి దిగి కుర్చీలో కూర్చుందుకు ప్రయత్నిస్తూంటే,

> ఏ కత్తీ గాయపరచలేనంత తీవ్రంగా ఒక చెడుమాట గాయపరుస్తుంది.
>
> —సర్ పి. సిడ్ని

"అక్కడ కాదమ్మా . . అలా వెళ్ళి సోఫాలో నిర్మల పక్కన కూర్చో" — అన్నాడు మృదువుగా డాక్టర్.

భయంగా సంకోచంగా నిలబడిపోయింది విజయ.

నిర్మల ఏమీ అనకుండానే సోఫాలో కూర్చుంది.

"నిర్మల . . ." గొణిగింది విజయ.

"ఫరవాలేదమ్మా . . వెళ్ళి కూర్చో . ."

అయిష్టంగా వెళ్ళి ఆమె పక్కన కూర్చుంది విజయ.

స్వింగ్‌డోర్స్ తెరుచుకుని, కండక్టర్ లోపలికి వచ్చాడు.

హఠాత్తుగా విజయ ముందు కురికి అతని చెయ్యి అందుకుంది.

"కూర్చో" అన్నాడు డాక్టర్ కండక్టర్ నుద్దేశించి.

అతను సోఫాలో విజయపక్కన కూర్చున్నాడు.

అతని నొసటిమీద ప్లాస్టర్‌ని మృదువుగా ముట్టుకుని, చెంపలు రెండింటినీ మెల్లిగా స్పృశించి . . అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది విజయ.

ఒక్కసారి కండక్టరే ఆమెను ముద్దుపెట్టుకుని — "నువ్వెందుకు వచ్చావిక్కడికి?" అన్నాడు.

"నీకు దెబ్బతగిలిందిగా! నిన్ను చూద్దామని . ."

మరోసారి విజయ నుదురు చుంబించాడు కండక్టర్.

"నీ వయస్సెంత కండక్టర్?"

సందర్భానుగుణంగా లేని ప్రశ్నకు తెల్లబోతూనే — "ఇరవైనాలుగు" అన్నాడు.

"పెళ్ళికాలేదు . . పిల్లలు లేరు . . . ఔనా?" ప్రశ్నించాడు డాక్టర్.

"ఊఁ."

"ఒక్కసారి విజయనీ, నిర్మలనీ చూడు" — కొంచం ఆగి మళ్ళీ డాక్టర్ అన్నాడు "విజయ చాలా ముద్దుగా ఉంటుంది — నిర్మలకంటే కూడా.."

అప్రియమైన నిజాన్ని చెప్పడం ఇష్టంలేనట్లు ఊరుకుండిపోయాడు కండక్టర్. నిర్మల డాక్టర్ కూతురని అతనికి తెలుసు.

"ఆ నిజం నేనూ అంగీకరిస్తాను కానీ . . పిల్లలు పువ్వులాంటివాళ్ళు . . వాళ్ళ మనస్సులు అతి సుకుమారాలు! అందుచేత పెద్దవాళ్ళు వారిపట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి" గంభీరంగా మారిపోయిన డాక్టర్ స్వరాన్ని గుర్తించి — "ఏం జరిగింది సార్?" అన్నాడు కండక్టర్ చాలా భయపడుతూ.

"విజయకు నువ్వంటే ప్రాణం . . ఇది నీకు తెలుసు. నిర్మలకు నువ్వు గర్భశత్రువ్వి . . . ఈ విషయం నీకు తెలియదు"

"నే నేమీ . . ."

"ప్రత్యక్షంగా నువ్వు బాధ్యుడివని నేననడంలేదు ఇవాళ నిర్మల నీకు మందు ఇవ్వవద్దన్నది. నీపై పగ బూనినట్లు మాట్లాడింది. దీనికి కారణం ఏమై ఉంటుంది?"

"ఏమో . ."

"ఈ నీ అమాయికత్వమే చాలా అనర్థాలకి దారి తీసింది. విజయపట్ల నువ్వు ప్రదర్శించే మమత, నిర్మలలో అసూయ రేపింది. ఇప్పుడు నీ కారణంగా నిర్మల విజయకుకూడా దూరంగా ఉండాలనుకుంటూంది. రూపురేఖలలో వ్యత్యాసమున్నా, తమకు లభించే వాత్సల్యంలో వ్యత్యాసాలను పిల్లలు సహించలేరు. పెద్దవాళ్ళ ప్రేమను కోరుకోవడంలో పిల్లలంతా సమానులే. మనం జాగ్రత్తగా వ్యవహరించకపోతే పరిణామాలు ప్రమాదకరంగా ఉండవచ్చు.

ఎదిగేపిల్లలు కూడా కొన్ని రకాలైన అసూయల కతీతులుకారు. నీ అనాలోచిత ప్రవర్తనవల్ల విజయా నిర్మలా శత్రువులు కాకుండా ఇకముందైనా జాగ్రత్తపడు."

"సారీ డాక్టరుగారూ . . క్షమించండి . . నే నింత ఆలోచించలేకపోయాను."

"ఇక నువ్వు వెళ్ళవచ్చు."

కండక్టర్ లేచి నిలుచున్నాడు.

విజయకూడా అతని చెయ్యి పట్టుకుని నిలుచుంది.

నిర్మలలో ఏ చలనమూ లేదు.

ఏదో ప్రయోగానికి ఫలితం గురించి ఎదురుచూస్తున్నట్లు కండక్టర్ వంక ఉత్సుకతతో చూస్తున్నాడు డాక్టర్.

విజయను ఒక్కసారిచూసి, ముద్దుపెట్టుకోబోయి కూడా ఆగిపోయి — కండక్టర్ త్వరత్వరగా స్వింగ్‌డోర్స్ తెరుచుకుని వెళ్ళిపోయాడు అక్కడ ఏమాత్రమూ ఉండలేనట్లు.

విజయ బేలగా చూస్తూ మిగిలిపోయింది.

నిర్మల ఉదాసీనంగా తల దించుకునే ఉంది.

ఊహించని ముగింపు ఎదురైనట్లు డాక్టర్ తుళ్ళిపడ్డాడు.

స్వింగ్‌డోర్స్‌మాత్రం అటూ ఇటూ ఊగుతున్నాయ్. ★